క్లుప్తంగా

తూతూ మంత్రంగా సదస్సులు

తిరువూరు: రెవెన్యూ సమస్యలపై గ్రామస్థాయిలో నిర్వహించే సదస్సుల సమాచారం స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయడంలో రెవెన్యూ అధికారులు ఉదాసీన వైఖరి అవలంభిస్తున్నారు. రెండు రోజులుగా జరుగుతున్న ఈ సదస్సుల గురించి తిరువూరు తహసీల్దారు కార్యాలయం నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో హాజరు కాలేకపోయామని రైతులు కూడా చెబుతున్నారు. పలు గ్రామాల్లో రెవెన్యూ సంబంధ సమస్యలు అధికంగా ఉన్నప్పటికీ అధికారులు తూతూ మంత్రంగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

సారా స్వాధీనం

చాట్రాయి: సారా తయారు చేసిన, విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పోలవరంలో నాటు సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి తయారీదారుడు కఠారి రామయ్య వద్ద నాలుగు లీటర్ల సారా, గోడేటి మారేశు వద్ద నాలుగు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వీఆర్వో సంఘానికి నూతన కార్యవర్గం



మైలవరం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వో సంఘం నూతన కార్యవర్గం శనివారం ఏర్పాటైంది. మండల సంఘం నూతన అధ్యక్షుడిగా పొందుగల వీర్వో పిట్ట దేవప్రియుడు, ఉపాధ్యక్షుడిగా వెల్వడం వీఆర్వో షేక్ కరిముల్లా, కోశాధికారిగా గణపవరం వీఆర్వోయన్నపు నాగ శ్రవంతి, కార్యదర్శిగా మైలవరం వీఆర్వో కొండల రాజీవ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని తహసీల్దారు బాలకృష్ణారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు దేవప్రియుడిని సన్మానించారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

నూజివీడు: క్రైస్తవుల సంక్షేమానికి, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో శనివారం క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి మంత్రి పార్థసారథి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఎమ్మార్ అప్పారావు కాలనీలో అభివృద్ధి పనులకు రూ.50 లక్షలు కేటాయించామన్నారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 కోట్లతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. పలువురు పాస్టర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



నూజివీడు: స్థానిక స్టేషన్ తోటలోని నాగేంద్రస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా స్వామి వారికి కల్యాణ మహోత్సవం, విశేష పూజలను శనివారం నిర్వహించారు. శ్రీవల్లి అమ్మవారిని పెళ్లి కుమార్తెగా, సుబ్రహ్మణ్య స్వామిని పెళ్లి కుమారుడిగా అలంకరించి ఆభరణాలతో ముస్తాబు చేశారు. అనంతరం కల్యాణోత్సవాన్ని భక్తులు వీక్షించారు. సామూహికంగా దంపతులు పాల్గొని స్వామి వారికి నూతన వస్త్రాలు అందించి కలశ పూజలు చేశారు. తొలుత ఆలయంలోని నాగేంద్రుని పుట్ట వద్ద భక్తులు పాలు పోసి, నాగ పడగకు విశేష పూజలు చేసి కుమారస్వామిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్న సంతర్పణ నిర్వహించారు.

గంపలగూడెం: మండలంలోని తోటమూల శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం షష్ఠి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా దేవతా మూర్తుల మూలవిరాట్లకు పంచామృతాలతో అభిషేకం జరిపి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు చేశారు. అనంతరం అర్చక బృందం శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం కనులవిందుగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు మహాన్నదానం చేశారు. ఆయా కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

ముసునూరు: శ్రీవల్లీ దేవసేన సమేత, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరు కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా శనివారం గోపవరం శివారు నాగేంద్రపురంలోని ప్రసిద్ధ శ్రీవల్లీ దేవసేన సమేత, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామి వార్ల మూర్తులకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. స్వామిని పెళ్లి కుమారుడిగా, అమ్మవారిని పెళ్లి కూతురిగా ముస్తాబు చేశారు. ప్రధానార్చకులు చిట్టిబాబు బృందం కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలువురు భక్తులు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

ఆగిన భవనాల సంగతేంటి?

- వివిధ దశల్లో నిలిచిన భవన నిర్మాణాలు
- పనులు పూర్తవుతాయోలేదో అని అయోమయం
- మందకొడిగా పౌర సేవలు
- మళ్లీ మండల కేంద్రాల చుట్టూ తిరగక తప్పదంటున్న ప్రజలు



చిన్నాగిరిపల్లిలో చివరి దశలో ఆగిపోయిన సచివాలయ భవనం



ఆగిరిపల్లిలో వినియోగంలోకి రాని సచివాలయ భవనం

ఆగిరిపల్లి: అన్ని రకాల ప్రభుత్వ సేవలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో ప్రభుత్వ భవన నిర్మాణాలను ప్రారంభించారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలు చేపట్టింది గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. మండల కేంద్రానికి వెళ్లకుండా ఉన్న ఊర్లోనే అన్ని సేవలు అందాయి.

విషయం ఇదీ..

అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తోంది. వివిధ దశల్లో నిలిచిపోయిన ప్రభుత్వ భవన నిర్మాణాలను పట్టించుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. పూర్తయిన భవనాలను సైతం వినియోగంలోకి తేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లే పాత రోజులు వచ్చేలా కనిపిస్తున్నాయి.

వివిధ దశల్లో ఆగిన 11 భవనాలు ..

మండలంలో 19 రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఒక్కో కేంద్రం నిర్మాణానికి రూ.21.80 లక్షలు కేటాయించారు. మండలంలో ఎనిమిది రైతు భరోసా కేంద్రాలు గత ప్రభుత్వంలోనే ప్రారంభమై రైతులకు సేవలందిస్తున్నాయి. మిగిలిన 11 గ్రామాల్లో భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఆగిపోయాయి.

హెల్త్ క్లినిక్‌ల పరిస్థితి ఇదీ..

మండలంలో ఒక్కో క్లినిక్ నిర్మాణానికి రూ.17.50 లక్షల వంతున 17 హెల్త్ క్లినిక్‌లు మంజూరు కాగా రెండు గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన గ్రామాల్లో భవన నిర్మాణ పనులు చివరి దశలో నిలిచిపోయాయి.

చిన్న చూపు ఎందుకో..

అయితే వీటి నిర్మాణాలపై కూటమి ప్రభుత్వం ఏవిధమైన చర్యలు తీసుకోవడం లేదు. గ్రామాల్లో ఎక్కువ భవనాలు నిర్మాణం చివరి దశలో ఉన్నా కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. దీంతో సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భవనాల పరిస్థితి ఇదీ..

మండలంలో 19 గ్రామ సచివాలయాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక్కో సచివాలయ భవనానికి రూ.40 లక్షల వ్యయంతో 19 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలోనే చొప్పరమెట్ల, ఈదులగూడెం, వట్టిగుడిపాడు, నరసింగపాలెం, కృష్ణవరం, సురవరం, అడవినెక్కలం, కనసానపల్లి, బొద్దనపల్లి, ఈదర- 2 గ్రామ సచివాల యాలు పూర్తి కావడంతో ప్రజలకు సేవలు అందుతున్నాయి. కొత్త ఈదరలో సచివాలయ భవనం నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఆగిరిపల్లిలోని రెండు గ్రామ సచివాలయాలు నెక్కలం గొల్లగూడెంలోని సచివాలయం నిర్మాణం చివరి దశలో ఉన్నాయి. చిన్నాగిరిపల్లి, నుగొండపల్లి సచివాలయాలు శ్లాబ్ దశవరకే జరిగాయి.

ప్రభుత్వం చొరవ చూపాలి..



సచివాలయాల ద్వారా ఊర్లోనే ప్రజలకు సేవలు అందుతాయి. మా గ్రామంతో పాటు ఇతర పల్లెల్లో ఆర్ఎస్‌కే, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలు ప్రభుత్వ మార్పుతో మధ్యలో ఆగిపోయాయి. ఆగిపోయిన భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపాలి.

– వేము రాజు, సర్పంచి, అడవినెక్కలం

కొత్త భవనాలను వినియోగించాలి..



గత ప్రభుత్వంలో నిర్మాణాలు పూర్తయిన ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తేవాలి. చివరి దశలో ఉన్న భవనాలను వెంటనే పూర్తి చేసి అందుబాటులో తీసుకురావాలి. గతంలో లాగానే అన్ని రకాల సేవలను గ్రామ సచివాలయాల్లో అందించాలి.

– వాకా సక్కేశ్వర్ రావు, ఆగిరిపల్లి

పరిశీలనలో ఉన్నాయి..

గతంలో ప్రారంభమైన అన్ని గ్రామ సచివాలయాల్లో, రైతుసేవా కేంద్రాల్లో ప్రజలకు ఎప్పటిలా సేవలు అందుతున్నాయి. కొన్ని గ్రామాల్లో నూతన భవనాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. అయితే మరికొన్ని చివరి దశలో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి నిర్మాణం వెంటనే పూర్తి చేసేందుకు ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

– నాగేశ్వరరావు, ఏఈ, పీఆర్, ఆగిరిపల్లి మండలం

పిల్లల చదువుపై తల్లిదండ్రులు ఆరా తీయాలి



మైలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వసంత, తదితరులు



తిరువూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

మైలవరం: తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశం శనివారం నిర్వహించారు. మైలవరం శ్రీరాజా ఎస్వీఆర్‌జీఎన్ఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సమావేశానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ హాజరయ్యారు. ప్రతి నెలా విద్యార్థులు, తల్లిదండ్రులు విధిగా పాఠశాలలకు వచ్చి వారి పిల్లల చదువు పట్ల ఆరా తీయాలన్నారు. డ్రగ్స్ వద్దు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి, సర్పంచ్ మంజుభార్గవి, ఎంఈవో ఎల్.బాలు, మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్, ఎస్సై సుధాకర్, ఏసీపీ తదితరులు పాల్గొన్నారు. జి.కొండూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే వసంత పాల్గొన్నారు.

- **నగదు ప్రోత్సాహకాలు ఇస్తా..**

తిరువూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు ఇస్తానని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రకటించారు. శనివారం తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 100 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25 వేల నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్ స్థాయిలో ఉన్నత మార్కులు సాధించిన 100 మంది విద్యార్థులకు కూడా ల్యాప్‌టాప్‌లు ఇస్తామని తెలిపారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. తిరువూరు ఆర్డీవో కే మాధురి, ఎంపీపీ గద్దల భారతి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరి బాయి, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రవికుమార్, హెచ్ఎం పీఎస్ఎన్ రాజు, నగర పంచాయతీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

- చాట్రాయి: మండలం పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్, టీచర్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమావేశమై ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. ఆటల పోటీలు నిర్వహించి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాలు చేశారు. చిన్నంపేట జెడ్పీ హైస్కూల్లో తహసీల్దార్ డి.ప్రశాంతి, చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో ఎంపీడీవో విజయలక్ష్మి, సి.గుడిపాడు హైస్కూల్లో ఎంఈవో బ్రహ్మచారి పాల్గొన్నారు.
- మైలవరం: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని ఎంపీడీఓ అనూరాధ తెలిపారు. మైలవరం గిరిజన సంక్షేమ వసతి రెసిడెన్షియల్ స్కూల్, ఎంపీపీ మోడల్ స్కూల్, ఎంపీపీ నంబర్-1 పాఠశాలలో ఏపీ ప్రభుత్వం పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఎస్ఎంసీ కమిటీ సభ్యురాలు, మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ పాల్గొన్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్ఎంసీ సభ్యురాలు నాగలక్ష్మి, సైబర్ క్రైమ్ ఎస్సై మహేశ్వరరావు, ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- గంపలగూడెం: మండలంలోని 70 ప్రభుత్వ ఎలిమెంటరీ, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు తోటమూల కేజీబీవీలో పాల్గొన్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు జరిపారు. పిల్లలతో కలిసి తల్లిదండ్రులు మధ్యాహ్న భోజనం చేశారు. ఎస్ఐ ఎస్.శ్రీను, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. మూలపాడు జెడ్పీ పాఠశాలలో ముఖ్య అతిథిగా సీఐ ఏ.చంద్రశేఖర్ పాల్గొన్నారు. గ్రామ సర్పంచి చింతల భూలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ కాకి వెంకటేశ్వరమ్మ, హెచ్ఎం డేవిడ్ రాక్ ఫెల్లర్ పాల్గొన్నారు. కొండపల్లి బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పేరెంట్ వేడుకల్లో మాజీ సర్పంచి కొల్లి వెంకటేశ్వరరావు, హెచ్ఎం రామమోహనరావు పాల్గొన్నారు. గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలలో ప్రిన్సిపాల్ శైలజ ఒక్కరే హాజరు కావడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు సమ్మెలో ఉన్నట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాఠశాలలో వార్డు కౌన్సిలర్, హెచ్ఎం కృష్ణవేణి కార్యక్రమం నిర్వహించారు. ఖాజీమాన్యం జెడ్పీ పాఠశాలలో వార్డు కౌన్సిలర్ చెన్నుబోయిన చిట్టిబాబు మాట్లాడారు.
- ఆగిరిపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మెగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్ఎం పుష్పలత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ రాజు పాల్గొన్నారు. తహసీల్దార్ ప్రసాద్, ఎస్సై శుభ శేఖర్ పలు అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఎంపీడీఓ బి.భార్గవి, ఎంఈఓ సర్వేశ్వరరావు, సర్పంచ్ లక్ష్మి, భాగ్యలక్ష్మి, ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పాలడుగు శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.
- ముసునూరు: స్థానిక జెడ్పీ హైస్కూలులో మంత్రి పార్థ సారథి పాల్గొన్నారు. రూ. 15 లక్షలతో దాత దేవినేని వరప్రసాద్ నిర్మించిన వంట షెడ్డు, డైనింగ్ హాల్, వాలీబాల్ కోర్టును ప్రారంభించారు.

తిరువూరు రూరల్‌లో..

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు జరిగాయి. ఆంజనేయపురంలో సర్పంచి మామిడి కుటుంబరావు, కోటేశ్వరి, చిట్టేలలో సర్పంచి శ్రీనివాసరావు, లక్ష్మీపురం ఎంపీయూపీ పాఠశాలలో సర్పంచి శ్రీనివాసరావు, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు మోకు లాగుడు, రంగవల్లుల పోటీ నిర్వహించారు.

నూజివీడులో..

నూజివీడు: మండలంలో, పట్టణంలోని పలు పాఠశాలల్లో శనివారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్లో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ బీవీ సుబ్బారావు, మీర్జాపురం హైస్కూల్లో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ పాల్గొన్నారు. తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, పలు పోటీలు నిర్వహించారు. నూజివీడులోని బాలికల హైస్కూల్లో పట్టణ ఎస్సై జ్యోతిబసు విద్యార్థినులకు, తల్లులకు సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఎస్ఆర్ఆర్ హైస్కూల్, గొల్లపల్లి హైస్కూల్, పల్లెర్లమూడి హైస్కూల్, యనమదల హైస్కూల్, అన్నవరం, పడమర దిగవల్లి, దేవరగుంట హైస్కూళ్లలో ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

డీఆర్‌డీఏ పీడీ విజయరాజు



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏలూరు జిల్లా డీఆర్ డీఏ పీడీ విజయరాజు

ఆగిరిపల్లి: ప్రజలు బ్యాంకు సేవలను వినియోగించుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఏలూరు డీఆర్‌డీఏ పీడీ విజయరాజు అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై జాతీయ సమగ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పీడీ విజయరాజు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, బ్యాంకుల ద్వారా వచ్చే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం బ్యాంకు సేవలపై సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఏపీఎం దయాల రాజశేఖర్, అశోక్ కుమార్, రాంబాబు, వెలుగు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుకు రేపటి లోగా అర్జీలు ఇవ్వండి

నూజివీడు: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల జాబితాలు సంబంధిత మండలాల తహసీల్దార్ల కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి శనివారం తెలిపారు. వాటిని పరిశీలించి, అర్హులు ఎవరైనా ఉంటే ఈనెల 9వ తేదీలోగా ఓటు నమోదుకు ఫారం-18 సమర్పించాలన్నారు. అభ్యంతరాలుంటే ఫారం-7, సవరణ కోసం ఫారం- 8 సమర్పించాలని సూచించారు.

మామిడిలో త్వరగా పూత రావాలంటే..



గణపవరంలో మామిడి తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు

మైలవరం: వాతావరణంలో మార్పిడి, అధిక తేమ శాతంతో మామిడిలో పూత ఆలశ్యం అయిందని, ప్రస్తుతం మామిడి పూతలో తేనె మంచు పురుగు, తామార పురుగు, పక్షి కన్ను తెగులు గమనించినట్లు మామిడి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త బీకే మహాలక్ష్మి తెలిపారు. గణపవరం, వెల్లటూరు గ్రామాల్లో మామిడి తోటలను నూజివీడు మామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారుల బృందం శనివారం పరిశీలించి, రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. పూతను ఉత్తేజ పరిచి త్వరగా పూత రావడానికి మల్టీ- కే 10 గ్రాములు, జింక్ రెండు గ్రాములు, బోరాన్ రెండు గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. పురుగు, తెగుళ్ల నివారణకు క్లోరిపైరిఫాస్ 50 ఈసీ ఒక ఎం.ఎల్, లీటర్ నీటిలో, దీంతో పాటు సాఫ్ రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఉద్యాన ఉప సంచాలకులు దేవముని రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి పీ బాలాజీకుమార్, ఇన్‌చార్జి ఉద్యాన అధికారి సోహైల్ అహ్మద్, వీఏఏ మహేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

నూజివీడు: ఎక్సైజ్ అధికారులు శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఓగిరాల తండాలో ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, ఏఈఎస్‌లు సీహెచ్ అజయ్‌కుమార్ సింగ్, జి.పాండు రంగారావు ఆధ్వర్యంలో సిబ్బంది బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సిబ్బంది మామిడి తోటల్లో విస్తృతంగా తనిఖీలు జరిపారు. తోటల్లో గుట్టుగా సారా తయారీకి సిద్ధంగా ఉన్న వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం డెప్యూటీ కమిషనర్ శ్రీలత పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.